# ఎవరికి ఎవరు

నీకేమిటోయి ఆరుగురు కొడుకు లున్నారు. తలో కొడుకు దగ్గిర తలో రెండు నెలలున్నా నీ రోజులు దివ్యంగా వెళ్లిపోతాయి అనేవాడు ఆరుగురు ఆడపిల్లలతండ్రి రామ్మూర్తి మేష్టరు విశ్వనాధంతో ఎప్పుడూ.

"ఆ.... యీనాటి కొడుకులు తల్లిదండ్రులని చూస్తారటోయి.... మనకి పెట్టవద్దూ పాడువద్దూ, వాళ్ళబ్రతులు వాళ్ళు బ్రతికితే చాలులే" అనే వాడు విశ్వనాధం మాష్టారు.

పైకి అన్నా లోలోపల "ఆరుగురు కొడుకులున్నారు" ఆరుగురిలో ఏ ఒక్కడన్నా ఆదుకోకపోతాడా అన్న నిబ్బరం ఆయనకీ వుండేది.

అందుకే ఈ రోజు నాలుగోకొడుకు ఇంటినుంచి వెడుతూ 'ఇంకా ఇద్దరున్నారు ఫరవాలేదు' అన్న ఆశతో ఐదోకొడు కింటికి ప్రయాణం అయ్యాడు ఆయన.

నలుగురు కొడుకుల యిళ్ళలో మర్యాదలు ముట్టాయి. యింక ఐదో కొడు కేదో తవ్వి తలకెత్తుతాడని ఆయన ఊహ!

తవ్వి తలకెత్తాలని, మర్యాదలు సత్కారాలు చేయాలని ఆయ నెన్నడూ కోరలేదు! ఆశించలేదు! ఆయన ఆశించింది రెండుపూటలా పట్టె డన్నం. పంచభక్ష్య పరమాన్నాలు కావాలని ఆయనమాత్రం ఎలా కోర తాడు! తను వాళ్ళకి చెప్పించిన చదువులతో వాళ్ళ తాహతులెరిగిన ఆయన మాత్రం అలాంటి కోరికలు ఎలా కోరతాడు! తండ్రికాబట్టి వార్ధక్యంలో ఆదుకోడం తమకర్తవ్యం అని గుర్తించి ఇంత పచ్చడివేసయినా అభి

మానంగా పెట్టాలని ఆయన కోరుకున్నాడు. తిట్టుకుంటూ, విసుక్కుంటూ సణుక్కుంటూ, ముష్టివెధవకి పడేసినట్లు కాకుండా కొస్త ఆప్యాయంగా అభిమానంగా కనిపెట్టాలని కోరుకున్నాడు

అదే, చిన్నకోరిక కూడా అసంగతమై పోయింది ఆయన విషయంలో!

మొదట్లో ఒక పది రోజులు కొస్త తండ్రి అన్న అభిమానంతో చూసేవారు. .... తరువాత తరువాత ముందు గొణగడం; పిల్లిమీద ఎలక మీదపెట్టి విసుక్కోడం, ఆతర్వాత ఎదురుగానే సాధింపులు.... కసురు కోడాలు ఆరంభమయ్యాయి.... ఒక్కొక్కళ్ళ యింట్లో ఆరు నెలలు వుండేసరికి గగనం అయింది. అదయినా అభిమానం చంపుకుంటే.... హు అభిమానం ఒకటేడిసిందా నాకు అనుకునేవాడు విశ్వనాథం.

నలుగురు కొడుకు లయ్యారు. యింక మిగిలిన యిద్దరూ మాత్రం యింతకంటే ఏం తీసిపోతారు అనిపించినా తప్పేదేముంది? కానీ చూద్దాం. ఆ మర్యాదలుకూడా రుచిచూద్దాం.... అనుకున్నాడు విశ్వనాథం.

ఏమాట కామాటే చెప్పుకోవాలి.... పాపం పెద్దకోడలు ఓ రెండు నెలలు అభిమానంగానే చూసింది. మామగా రన్న మర్యాద చూపెట్టింది. తర్వాత మరి ఏమయిందో సణుక్కోవడం విసుక్కోవడం ఆరంభించింది. "అబ్బబ్బ వెధవగోల వచ్చిపడింది, మనిషికోరకంగా వండి వార్చలేక చస్తున్నాను. అసలే యీ చాకిరీకితోడు యీ చప్పిడి వంటలు, ఈ రొట్టెలు నా నెత్తిన వచ్చిపడ్డాయి పీడ! విసుక్కుంటూంటే, పాపం పిల్లలతో చేసుకోలేక విసుక్కుంటుంది. అని సర్దుకునేవాడు విశ్వనాథం. సర్దుకోక ఏంచేస్తాడు కనక.... ఎవరిమీద కోపగిస్తాడు? కోపగిస్తే వూరుకునేది ఎవరు! వాళ్ళన్నారనికాదు తన రోగమూ అలాంటిదే. ఏంచేస్తాడు? బ్లడ్ ప్రెషర్‌ట.... షుగర్.... కడుపునొప్పి - ఇంకా ఏవేవో ధనవంతుల

రోగాలన్నీ తనకెందుకు పెట్టాలి ఆ భగవంతుడు? డబ్బున్న వాళ్ళకి జరిగినట్లు తనకెలా జరుగుతుంది?

కోడలు.... పోనీ పరాయి యింటిపిల్ల తనమీద అభిమానం ఎందుకుంటుంది! కొడుకు.... కన్న కొడుక్కి కూడా తనెంత శత్రువయ్యాడు? తనేదో మూటలు దాచుకుని తనకి యీయడంలేదని కొడుక్కి కోపం.

"నాన్నా, యీ నెలన్నా మీ పెన్షన్ డబ్బులు యీయడానికి వీలుంటుందా? అహ, వీలుంటేనే, ఆ బట్టలకొట్టువాడు ప్రాణాలు కొరుకుతున్నాడు" అంటూ నిష్ఠూరంగా అడిగాడు ....

డబ్బుంటే యియ్యకుండా మూటకట్టుకుపోతాడా తను! ఆ మాత్రం ఎందుకు ఆలోచించరో! కోడలు వెనకనించి సన్నాయి నొక్కులు నొక్కుతుంది.

"ఆ.... మనమెంతకని అడుగుతామండీ, ఆయన కుండాలి ఆ యింగితం. అయ్యో కరువుకాలం పిల్లలు వాడు అవస్థ పడుతున్నారని ఏదో పరకో చేతిలో పెట్టాలిగాని, మీ రెన్నిసార్లు అడుగుతారు? తినేది యిక్కడ, దోచిపెట్టేది ఇంకోరికి" అంది.

ఎవరికి దోచిపెడ్తున్నాడు తను! వాళ్ళే పిల్లలా.... ఈ కొడుకు కొడుకుకాదా! తనకొచ్చే ముష్టి నలభై ఐదు రూపాయల పెన్షన్ దాచేసుకుని మూటలు కడ్తున్నాడని వాళ్ళ అపోహ! డబ్బుంటే కొడుకు యిబ్బందులుచూస్తూ తనుమాత్రం వూగుకుంటాడా? ఆ ముష్టి నలభై రూపాయలకి ఎన్నిఖర్చులు! ఒకనెల బొత్తిగా పంచెలు చినిగిపోతే నాలుగు కొనుక్కున్నాడు. మరి ఆ ఖర్చు కూడా కొడుకునెత్తిన రుద్దలేదుగదా! సరే యింకా ముక్కుపొడుం అనో. మందులనో తన ఖర్చు లుండనే వున్నాయి. ప్రతిదమ్మిడీ కొడుకుని ఎక్కడ అడుగుతాడు! యింకోనెల

నాలుగో కొడుక్కి కూతురుపుడితే మరి ఆ చంటిదానికి ఓ చిన్నమెత్తు బంగారమన్నా పెట్టి ఏదో చేయించాలిగదా, బారసాలకి దానికి వెళ్ళిరావడానికి రైలుఖర్చు అది అలా అయిపోయింది. ఇంకోనెల పెళ్ళాం మాసికలు వేసిన గుడ్డలు కట్టుకుంటూంటే రెండు చీరలు, జాకట్టులు, చలికి ముడుచుకు పడుకుందని ఓ రెండు దుప్పట్లు కొన్నాడు. ఆ నెల మూడో కూతురు వచ్చింది. ఆడపిల్ల పుట్టింటి కొచ్చిన ఆడపిల్లకి తాము వుండగానే గదా ఏదో యింత పసుపు కుంకం పెట్టడం! తర్వాత అన్నలు పెట్టబోయారా వాళ్ళ పుచ్చుకోబోయారా.... దానికి చీర రవిక, పిల్లలచేతుల్లో పది రూపాయలు పెట్టేసరికి ఆ నెల పెన్షన్ డబ్బుకాస్తా హరించింది. ఇంకో నెల ఏ మయినాసరే కొడుక్కి యివ్వాలనే అనుకున్నాడుగాని.... అనుకోని ఖర్చు నెత్తినపడితే తనేం చేస్తాడు? కళ్ళజోడు గూట్లో పెట్టింది కాస్తా నాలుగేళ్ళ మనవరాలు లాగిపడేసింది. గుంటముండ! ఏం చేస్తాడు. జోడు లేకపోతే కళ్ళు కనపడి చావవాయె.. క్రొత్తది కొనుక్కున్నాడు. ఇలాగే ఆరునెలలనుంచి అయిపోయింది. నిజమే ఇంట్లోవున్నాడు. డబ్బు చాలక యిబ్బంది పడ్తున్నారు. ఓ పదో పదిహేనో చేతిలో పెడదామని తనకుమాత్రం లేదూ! ఏం చేస్తాడు! ఖర్చులు అలా వచ్చాయి. ఏ వేళకి వాళ్ళకి అన్నీ జరిపించాలిగదా! యీ మాత్రం అర్థంచేసుకుండా కొడుకు కూడా అలా మాట్లాడడం కష్టం కలిగించింది.

ఓ ఆర్నెల్లుండి రెండో కొడుకింటికి ప్రయాణం అయ్యాడు. అక్కడేదో ఇంతకంటె పరిస్థితి బాగా వుంటుదన్నట్టు!

తీరా అక్కడికి వెళ్ళగానే పెద్దకోడలే ఎంత నయమో తెలియవచ్చింది. పెద్దకోడలు ఓ రెండు నెలలయినా గౌరవంగా చూసింది. యీవిడ వెళ్ళినవారం పదిరోజులకే యీ రొట్టెలు చేయడం వేరే చప్పిడివంటలు అవి వండడం తనవల్లకాదని ఖచ్చితంగా చెప్పేసింది.

వుంటే వుండమన్నట్లు మాట్లాడింది ఎదురుగానే, మామగారన్న గౌరవం అయినా లేకుండా ఏంచేస్తాడు! చచ్చినట్టు అవే తిన్నాడు. అన్నంతింటే షుగర్ ఎక్కువయింది. డాక్టరు వద్దంటాడు. ఇంట్లో కోడలు చేయదు. కారాలు వడక కడుపు నొప్పి ఎక్కువయింది.

అన్నిటికంటె కోడలు ఎదురుగా అలా అంటున్నా కొడుకు వింటూ వూరుకోవడం ఆయనకి కష్టం కలిగించింది. కోడలు అందనిబాధ ఎందుకు నువ్వు బంగారం మంచిదయితేగా .... అనుకున్నాడు. నాలుగు నెలలుకూడా గడవకుండానే కొడుకు 'నాన్నా, తమ్ముడు మా వూరికి నాన్న నిపంపు అంటూ రాస్తున్నాడు, అని పదిసార్లు అన్నాడు. నిజమే ననుకుని మూడో కొడుక్కి తనమీదవున్న ప్రేమకి మురిసిపోతూ వెంటనే మూట ముల్లెతో మూడో కొడుకింటికి ప్రయాణం కట్టాడు.

తీరాచేసి మూడోకొడుకు గుమ్మంలో అడుగు పెట్టాకగాని అక్కడ తనని ఎవరూ ఆహ్వానించలేదని, తనకోసం ఎవరూ కలవరించ లేదని యిదంతా తనని వదుల్చుకోడానికి రెండోకొడుకు చేసిన దురాలోచన అని తెలుసుకుని కృంగిపోయాడు.

మూడోకోడలు మామగారిని చూసి గుమ్మంలోంచే మూతి త్రిప్పుకుని లోపలికి వెళ్ళిపోయింది. కొడుకు కనీసం వచ్చారా అనేనా పలకరించలేదు. అప్పుడే ఆ యింట్లో తనకి జరగబోయే సత్కారాలు అర్థం అయ్యాయి. కాని తప్పేదేముంది! ఈ కోడలు రోగిష్టిదిట ఆయాసంట, నీరసంట। పిల్లలకే వండిపెట్టలేక చస్తుంటే ఈ తద్దినం ఒకటి వచ్చి పడింది. అని విసుక్కుంది. "ఇంట్లో పిల్లలకి తలో అరగ్లాసుడు పాలు ఇచ్చుకుందామన్నా గతిలేదు. కాని.... యీాయినగారికి మాత్రం రెండుపూటలా రెండుగ్లాసులు పాలు నైవేద్యంపెట్టాలి" మొగుడిదగ్గిర అంటూంది.

గ్లాసుకి మూడొంతులునీళ్ళు ఒక వంతుపాలు ఇస్తూకూడా ఏదో

ఇంట్లో పాలన్ని తనే త్రాగేసినట్టు ఎందుకలా సాధిస్తుందో కోడలు అనుకునేవాడు విశ్వనాథం. మరి తనేం చేస్తాడు! కాఫీ వద్దంటారు డాక్టర్లు.

ఈ కొడుకు తన దగ్గిరనించి డబ్బులాగే తెలివి తేటలలో అన్నలని మించిపోయాడు. ప్రతినెలా తనింకా పెన్షన్ అందుకోకముందే ఏవేవో చెప్పి ఆ డబ్బులేకపోతే పీకలమీద ప్రమాదం కూర్చున్నట్టు మాట్లాడి మాయచేసి పట్టుకుపోయేవాడు. విశ్వనాథంచేతిలో దమ్మిడీలేక మందులుకూడా కొనుక్కోలేక నానా అవస్థ పడసాగాడు. ఇది చాలనట్లు 'నాన్నా, నీ ప్రావిడెంట్ ఫండ్ తాలూకు డబ్బంతా ఏంచేశావు! ఇన్సూరెన్సుడబ్బు వెయ్యిరూపాయలు వచ్చినట్లుంది. అదెక్కడ దాచావు!' అంటూ అడుగుతూంటే పళ్ళు మండేది విశ్వనాథానికి.

"ఏం తెలీనట్టు క్రొత్తగా అడుగుతాడేం! ప్రావిడెంట్ ఫండ్ ఏం చేశాడు?, ఆడపిల్ల లిద్దరి పెళ్ళిళ్ళకి చేసిన అప్పులు ఎవరు తీర్చారు? తనీ స్కూలు మేష్టరు జీతంతో తొమ్మండుగురు పిల్లలని పెంచి పెద్దచేశాడు ఆ రోజుల్లో గాబట్టి! చదువులు, పెళ్ళిళ్ళు అన్నీ ఎన్ని ఇబ్బందులు పడి చేశాడో ఎరగరా యీ పిల్లలు? ఆడపిల్లల పెళ్ళిళ్ళకి అప్పులు తెచ్చి ప్రావిడెంట్ ఫండ్ రాగానే చెల్లబెట్టినట్లు తెలియకనేనా ఆడగడం! ఇన్సూరెన్సు డబ్బు గురించి అందరూ కలసి తనమీద కారాలు నూరిన సంగతి మరచే అడిగాడా! ఐదో వాడు అవిటివాడు. చదువు సంధ్య అబ్బలేదు. ఎదో పేపరు ఏజన్సీ తీసుకుంటాను ధరావతుకి వెయ్యి రూపాయలు కట్టాలంటే ఆ డబ్బు ఆ కొడుక్కి ఇచ్చాడని అందరూ మూతులుముడుచుకున్న సంగతి జ్ఞాపకంలేకే అడిగాడా! అ ప్రయోజకుడయిన ఆ కొడుకు గతి తన తర్వాత ఏమిటని ఆలోచించి ఆ వెయ్యి వాడికి ఇచ్చాడు. ఇంకా ఇన్నాళ్ళు తనదగ్గిర కూర్చుందా? ఎంతసేపూ తన డబ్బుమీదేగాని తన మీద అపేక్ష ఎక్క

డుంది వాడికి. ప్రతీ నెలా ఏదో చెప్తాడు. మరి ఇన్నాళ్ళు ఎలా గడిపాడో ! యీ డబ్బు లేకపోతే ఏం చేసేవాడో !

రోజురోజుకీ కొడుకు డబ్బుకి పీడింపడం, ఆ బాధ భరించలేక యీ సారి ఎవరూ వెళ్ళమనకుండానే నాలుగో కొడుకింటికి ప్రయాణం కట్టాడు ఆయన.

నాలుగో కోడలు మామగారు పెద్దవారు అని గౌరవించడం మాట దేముడెరుగు, తనని అవమానించింది. పురుగు కన్నా హీనంగా చూసింది. విసుక్కున్నా సణుక్కున్నా తనంత బాధపడకపోను. కాని ... తలుచుకుంటే మనసు దహించ సాగింది ఆయనకి.

"అబ్బబ్బ, మీ నాన్నగారేమిటండీ బొత్తిగా అంత ఎడ్డి మనిషి. ఆ బట్టలు ఆ పళ్ళు, ఆ పళ్ళ కంపు.... సరేసరి ముక్కుపొడుం వాసన పిల్లలకి కూడా తగిలిస్తున్నారు. ఆ వాసన. డోకువస్తూంది అంది. పిల్లలని కూడా తన దగ్గరికి రాకుండా కట్టడి చేసింది.

ఇంకోసారి వర్షం వస్తూంటే ఎండేసుకున్న పంచ కోడలు ఎలాగూ తీయదని తెలిసి తనే వచ్చాడు తీసుకోడానికి. తను బట్టలు తీసుకుని మామ గారిపంచ ఓ కర్రపుల్లతో తీస్తూంది. ఎంతో నొచ్చుకున్నాడు ఆయన. త నంత అంటరాని వాడా ! తనపంచ పుల్లతో తీస్తూంది. తన విస్తరి చేత్తో ఎత్తకుండా చీపెరుతో తోస్తుంది. అంత ఏహ్యంగా వున్నాడా తను !

ఎంత అభిమానం చంపుకుని కొడుకు పంచ చేరినా అంత హీనస్థితిని భరించలేక మూడునెలలు కూడా నిండకుండానే ఐదో కొడుకింటికి బయలు దేరాడు.

ఆ ఇద్దరి యిళ్ళలో మర్యాదలు రుచి చూస్తే అనుభవం పూర్తి అవుతుందను కున్నాడు ఆయన.

ఐదో కోడలు మామగారిని ఏదన్నా అనడానికి అశక్తురాలు కనక వూరుకుందో, లేక స్వతహాగా మంచిదోకాని మామగారిని అభిమానంగా చూసింది. ఐదో కొడుకు కూడా మిగతా వారికన్నా భిన్నంగా ఆప్యాయంగానే చూశాడు తండ్రిని. కొడుకు అవిటివాడు! కోడలు మూగది! అవును అవిటి వాడికి మంచి పిల్ల ఎక్కడ దొరుకుతుంది. ఏదో వాళ్ళ బ్రతుకులు వాళ్ళు బ్రతుకుతున్నారు. కోడలు ఇష్టం లేకపోతే మాటరాకపోయినా చేతలద్వారా చూపించచ్చు అయిష్టత. కానీ అలాంటి దేం కనపడలేదు విశ్వనాథానికి. అక్కడున్న ఆరు నెలలలోనూ, కాస్త ప్రశాంతిగా ఏ పోటు లేకుండా వున్నా ననుకునేసరికి కోడలు నెలలునిండి పుట్టింటికి వెళ్ళవలసి రావడంతో మళ్ళీ స్థానభ్రష్టత తప్పలేదు ఆయనకి.

ఆరో కోడలు రిక్షా దిగుతూండగానే మొగం ముట్లించుకుంది. ఆవిడేనా అక్కగార్లకి తీసిపోయింది! ఏమీ ఏం తీసిపోదని నెలరోజులకే నిరూపించుకుంది.

"అబ్బ.... ఇదోగొడవ వచ్చిపడింది నెత్తిమీదకి. ఎక్కడికీ ఫ్రీగా వెళ్ళడానికి లేకుండా ఈ ముసలాయన ఒకడు పీకల మీదికి" అంటూంది.

తనేమన్నా వాళ్ళని సినిమాలకి వెళ్ళద్దన్నాడా, షికార్లకి వెళ్ళద్దన్నాడా? పిల్లల్ సరదాలని అర్థం చేసుకోలేని మూర్ఖుడా! అక్కడికీ కోడలు సినిమాలకి వెళ్ళినప్పుడు పాలుపోయించుకోమని, ఆ అన్నం దింపేయమని పురమాయించి వెడుతూంటే తను కాదన్నాడా! మరింకా ఎందుకో యీ నిష్ఠూరం?

యీ మాత్రానికే అయితే ఆయన యింత బాధపడకపోను. ఒక రోజు కొడుకుతో తను వింటున్నాడని తెలిసినా అంటూంది కోడలు- 'మన దేశంలోనే యిలా యీ ముసలాళ్ళు కొడుకుల యిళ్ళు పట్టుకుని వ్రేలాడ్డం. అమ్మా నాన్న అంటూ ఎవరూ పై దేశాలలో ఇళ్ళలోకి చేరదీయరు.

అక్కడ ఎవరి దారి వారిదే! హాయిగా వుంటారు చీకు చింతా లేకుండా. మనదేశంలోనే యీ దిక్కుమాలిన అలవాట్లు, ఆచారాలున్నూ. పై దేశాలలో ఒకళ్ళ మీద ఒకరు ఆధారపడరు. అంతగా డబ్బులేనివాళ్ళయితే అలాంటివాళ్ళని చూడడానికి ఆశ్రమాల్లాంటివి వుంటాయిట....' చదువుకున్న కోడలుగదా- అంటే మిగతా వాళ్లకంటె స్కూలు ఫైనలు ప్యాసయి, ఉద్యోగం కూడా వెలిగిస్తూందిగా మరి, దేశదేశాల ఆచారాలు ఏమిటో తెలుసు ఆవిడకి. వింటున్న విశ్వనాథం నవ్వుకున్నాడు.

విదేశాలదాకా ఎందుకు? మనదేశం మాత్రం అంతకంటె ఏం తీసిపోయింది. ఇంకా అక్కడ తనలాంటివారిని ఆదుకోడానికి ఓల్డ్‌హోమ్స్ వున్నాయి. ఇక్కడ అలాంటివి లేకుండానే తల్లిదండ్రులని ఇంట్లోంచి తరిమేస్తున్నారు. తేడా అంతే!

హుఁ. ఏం పిల్లలు? ఎందుకొచ్చిన వ్యర్థమైన ఆశలు వాళ్ళమీద! రెక్కలు రాగానే ఎవరికి వారే అయ్యే పశు పక్ష్యాదులకి, బుద్ధెరిగిన మనుష్యులకి ఏం తేడావుంది? .... తేడా లేక ఏం .... రెక్కలొచ్చిన పక్షుల గురించి తల్లి తండ్రి బాధపడవు. వాటిగురించి యావ వుండదు! కానీ.... మనుష్యులు అంత తేలిగ్గా కన్న సంతానంమీద వాళ్ళెలాంటివారైనా మమ తానురాగాలు వదులుకోలేరు. అదే తేడా- మనిషికి పశువుకి అనుకున్నాడు విశ్వనాథం.

ఆరుగురు కొడుకులూ అయ్యారు! ఆరుగురు కొడుకుల యిళ్ళలో పుచ్చుకోవలసిన మర్యాదలూ అందాయి. కలో గంజో ఒకపూట త్రాగి పస్తులుండడం, ఏ చెట్టుక్రిందో పడుకోడం యీ బ్రతుకు కంటె నయం కాదా! కొడుకుల యింట్లో హీనాతి హీనంగా పడుండడంకంటె ఎవరి పంచలోనైనా పడుంటే వచ్చే అవమానం ఏముంది! ఆ వచ్చే పెన్షన్ డబ్బులతో, నాలుగిళ్లలో నలుగురు పిల్లలకి చదువు చెప్పుకుంటే యీ మాత్రం బ్రతకలేకపోడు!

యీ మాటే ముందు అంటే కొడుకు లందరూ అప్పుడు ఏమన్నారు? తలో కొడుకు తలో పదో యిరవయ్యో పంపితే. పెన్షన్ డబ్బు అది కలిపి ఏదో జీవితం వెళ్ళబుచ్చొచ్చని కొడుకుల చెవిని ఆమాట వేశాడు. "నాన్న మీరు పెద్దవా రయ్యారు. ఎలాగో రిటైరయ్యారు. .. మళ్ళీ యిక్కడ కాపరం ఎందుకు? కలో గంజో అందరం ఒకచోటవుండే త్రాగుదాం. యిక్కడ యింటద్దె అదీ దండుగ కదా! తలొకళ్ళయింట్లో తలో ఆరు నెలలువుంటే నిక్షేపంలా మీ రోజులు వెళ్ళిపోతాయి. మాతో వుండురుగాని "అంటే నిజ మనుకున్నాడు. కొడుకుల అభిమానానికి మురిసిపోయాడు. అంతే కాని, తలో పదో ఇరవయ్యో ఎత్తిపంపడం కంటె తండ్రిని ఇంట్లో ఉంచుకుంటె తండ్రి పెన్షన్ డబ్బు అదీ కలసి వస్తుందని .... అంతదూరం ఆలోచించా రని గుర్తించ లేకపోయాడు.

కొడుకులన్నట్టు తన పెన్షన్‌లో ముప్ఫై రూపాయలు ఇంటద్దె పోతుంది. కొడుకులు కాస్తోకూస్తో పంపినా యీ కరువు కాలంలో ఎలా సరి పోతుంది? పదిమంది పిల్లల యిల్లు! యిల్లంటూ తల్లి తండ్రి అంటూ వున్నాక ఎవరో ఒకరు వచ్చి పోతూనే వుంటారు; సరే, ఆడపిల్లలు రావడం, పోవడం, అల్లుళ్ళు కోడళ్ళు మనవలు ముద్దుముచ్చట్లు వున్నాం తలో ఎవరివేళకు వాళ్ళకి జరపాల్సిందే గదా! వీటన్నింటికీ డబ్బెక్కడ నించి వస్తుంది; తనకా బ్లడ్ ప్రెషర్, గుండెదడ. నాలుగిళ్ళలో పిల్లలకి చదువు చెపుదామన్నా ఇవన్నీ ఆలోచించి కొడుకులు చెప్పిన దానికి ఆమో దించాడు.

కాని తన డబ్బుకోసం... తమ తల్లి చాకిరీకోసం ఆశపడ్డారు తప్ప తల్లి తండ్రి అన్న అభిమానం ఎక్కడుంది! బాగా తెలిసి వచ్చిందిఆయనకి.

భార్య గుర్తురాగానే ఆయన మనసు బాధగా మూలిగింది. తన భార్య ... వాళ్ల తల్లిని... ప్రతివాళ్ళూ వంటలక్కకంటె పనాకష్టంగా వుప యోగించు కొంటున్నారు. పాపం... అది నోరెత్తకుండా కొడుకుల యిళ్ళలో చాకిరీ చేస్తూంది. ఎన్నాళ్ళయింది భార్యని చూసి! ఒకనెల ఏమన్నా కలసి వున్నారేమో పెదకొడుకు యింటికి వెళ్ళాక! అంతే, అప్పటినించి ఒక కోడలికి పురిటిరోజులని, ఇంకో మనవడి అన్న ప్రాసనలని, ఇంకో కోడ

కథా నిలయం 786 శ్రీకాకుళం

రికి పేనీళ్ళని, ఇంకో మనవరాలు సమర్తాడిందని, ఇంకో పిల్లడికి బారసాలని మనవరాలి పెళ్లని.... యిలా ఎవరికి కావలసినపుడు వాళ్ళు తల్లిని పిలిపించుకుని ఆవిడ శక్తిని పూర్తిగా వినియోగించుకొంటున్నారు. వాళ్ళ అవసరాలకోసం। వాళ్ళదృష్టిలో ఆవిడ ఒక పనిమనిషి ! అంతేకాక తల్లి తండ్రి ఇద్దరిని ఒకరే భరించడం కష్టం అని చెరొకరిని తలొకరు వంతుల ప్రకారం పంచుకున్నారు అదేదో సినిమాలోలాగ !

తను, తనభార్య నలుగురి ఇళ్లలో ముష్టెత్తుకునైనా ఇంతకన్నబాగా బ్రతకచ్చు। కనీసం ఒకేచోట పడుండి ఒకరి కొకరు తోడునీడగావుండచ్చు !

ఆ ఆలోచన రాగానే ఇంక ఆయన ఆలస్యం చేయకుండా మూడో కొడుకింట్లోవున్న భార్యకి వెంటనే తమ ఊరికి వచ్చేయమని ఉత్తరం రాసి పడేసి ప్రయాణం అయ్యాడు.

భార్యని చూస్తూనే ఆయనకళ్ళు చెమ్మగిల్లాయి.... "పార్వతీ ! నీకు నేను నాకు నీవు తప్ప మన కెవరూ లేరు. ఈ పిల్లలు, ఈ ఆశలు, మమకారాలు అన్నీ ఉత్తవే పార్వతీ .... ఈనాటినుంచి మనం ఎవరికీలేం. మళ్ళీ మన యిద్దరమే క్రొత్తజీవితం ఆరంభించాలి పార్వతీ .... ముందులాగ మనకి ఎవరూ లేరు పార్వతీ .... ఎవ్వరూ లేరు" భార్య చెయ్యి పట్టుకుని ఏదో గొణిగాడు ఆయన.

భార్యని సత్రంలోవుంచి గృహాన్వేషణార్థం బయలుదేరేముందు మళ్ళీ అన్నారు. 'పార్వతీ, నీకు నేను నాకు నీవు తప్ప, ఎవరున్నారు మనకు?' పార్వతమ్మకి ఆయన అన్నది అర్థం కాకపోయినా కొడుకుల యింట్లో విసిగిన ఆమె మనసు ఆ మాటలు నిజమంది.

ఈ లోకంలో ఎవరికి ఎవరు ఉండరు, ఎవరికివారే అన్న సత్యం విశ్వనాధానికి తెలియదా ! ఆయన ఇల్లు వెతుక్కుని వచ్చేసరికి నిద్రపోతున్న పార్వతమ్మ మరి ఆ నిద్రనించి లేవలేదని ఆయనకి ముందు తెలుసుంటే ఆమాట అంత నిబ్బరంగా అనివుండే వాడు కాదేమో ! ....

(1969 జయశ్రీ పత్రిక నుండి)

8)